

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించాలి

**కొడంగల్,డిసెంబరు 20ప్రభాతవార్త** కొడంగల్‌తో పాటు నియోజకవర్గంలో ఉన్న వందలాది ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించాలని మైనార్టీ నాయకులు,మాజీ ఉపసర్పంచ్ ఎస్.ఎం.గౌసన్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న వందలాది ఎకరాల వక్ఫ్‌భోర్డు భూములను కొందరు దర్జాగా క్రయ విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. పలు చోట్ల అనుమతుల్లేకుండానే పలువురు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు కబ్జాకు గురవు తున్నాయని వాపోయారు.వక్స్ బోర్డు భూముల క్రయ విక్రయాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.ఇలాగే ఉదాసీనంగా వ్యవహరిస్తే వక్స్ భూములు పూర్తిగా అన్యాక్రాంతం అవుతాయన్నారు.వక్స్ భూముల అన్యా క్రాంతం,క్రయ విక్రయాలపై గతకొన్ని నెలల క్రితం అధికారులకు వినతి పత్రాలు అందించడం జరిగిందని,ఇప్పటికైనా అధికారులు స్పందించి వక్స్ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఇదే విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

### జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నిరుపేద,నిరాశ్రయిలు, వితంతువులు, విడాకులు తీసుకున్న ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు, ఈ రెండు లేని పక్షంలో గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షలు పట్టణ ప్రాంతంలో రూ.2లక్షలు మించకుండా ఆదాయ ధృవీకరణ పత్రం ఉండాలన్నారు. అభ్యర్థి కనీసం 5వ తరగతి విద్యార్హత కల్గివుండాలన్నారు.గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి ఆర్థిక మరియు వస్తురూపంలో లబ్దిపొందలేని అభ్యర్థి సెల్ఫ్ డిక్లరేషన్ ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు జతచేస్తూ జిల్లా కలెక్టర్ సముదాయంలోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.



పూజ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

## పూజకు మెరుగైన వైద్యం అందిస్తాం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పూజ ఇటీవల ప్రమాదానికి గురైన సంఘటనపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని పూజ తల్లిదండ్రులు బాబ్యా నాయక్, బుజ్జి బాయ్, తదితరులు కాంగ్రెస్ ఆదివాసీ సెల్ జిల్లా నాయకుడు శ్రీను నాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్ సహకారంతో ఎమ్మెల్యేను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూజ తల్లిదండ్రులతో మాట్లాడారు. జరిగిన విషయం తెలుసుకున్నారు. పూజ గాయపడడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తు విద్యార్థిని పూజ బిల్డింగ్‌పై నుండి కింద పడిందని, ఇందులో ఎవరి పొరపాటు లేదని చెప్పడంతో ఎమ్మెల్యే ఆమె చికిత్సకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. మెడిసిన్ కోసం వెంటనే సొంతంగా రూ.10 వేలు విద్యార్థిని తండ్రి బాబ్యా నాయక్‌కు అందజేశారు. అదేవిధంగా నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించే విధంగా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని జిల్లేడ్ చౌదరిగూడెం మండలం ముష్టిపల్లి కొత్తరామ తండాకు చెందిన విద్యార్థిని పూజకు ప్రభుత్వం తరుఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ కూడా తర్వాత అందజేస్తామని గిరిజన నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు ఆకాష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఆర్థికంగా సహకరించడమే కాకుండా వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావడం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొక్క నర్సింహ్మారెడ్డి

**మహేశ్వరం, డిసెంబరు 20 ప్రభాతవార్త :** స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మండల అధ్యక్షులు సిద్దోజు మాధవచారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డి విచ్చేశారు. భూత్ ఎన్నికల అధికారిగా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లో భూత్ కమిటీలు పటిష్టంగా ఉంటేనే అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు కానందున గ్రామంలో ప్రతి ఇంటికి చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పీఎం మోడీ పంపె నిధులు, పథకాలన్ని ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో మండలంలో అత్యధిక సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసితో సహా అన్ని బిజెపి అభ్యర్థులు గెలిచేటట్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెకెఎం జాతీయ కార్యవర్గ సభ్యులు పాపయ్యగౌడ్, బిజెపి ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కె. మనోహార్, అధ్యక్షులు జి.మాధవ్, పిఎసిఎస్ డైరెక్టర్ నర్సమ్మ, బిజెపి నాయకులు కిషన్ నాయక్,బిజెపి ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, మాజీ బూత్ కమిటీ అధ్యక్షులు సురేందర్‌చారి, బిజెపి సీనియర్ నాయకులు యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాగిరెడ్డిపల్లి గ్రామ నూతన బూత్ కమిటీ

నాగిరెడ్డిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు కె.రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆంగోత్ రాజేష్, బిజెవైఎం బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎం. శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బిజెపి కిసాన్ మోర్చ కమిటీ అధ్యక్షులుగా బీర్ల మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఏర్పుల యాదయ్య, బిజెపి బూత్ మహిళా మోర్చ కమిటీ అధ్యక్షులుగా సుజాత, ప్రధాక కార్యదర్శిగా చేగూరి మీనా, ఓబిసి బూత్ కమిటీ అధ్యక్షులుగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా వెంకట రాములు, బిజెపి గిరిజన మోర్చా బూత్ కమిటీ అధ్యక్షులుగా కాట్రవత్ రమేష్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అమిత్‌షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి

### ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై ప్లకార్డులతో నిరసన

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** భారత పార్లమెంటు రాజ్యసభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ షాద్‌నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, భారత విద్యార్థి ఫెడరేషన్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్డీ), తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఆయన చేసిన వెనక్కి తీసుకోవాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజల్ని అవమానించమేనని అన్నారు. బాధ్యత గల హోదాలో ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్, అంబేద్కర్ అంటూ హేళన చేసిన అమిత్ షాను కేంద్ర మంత్రిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీను నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, నాయకులు కావలి రాజు, మైలారం జంగయ్య, ముఖిత్, కృష్ణయ్య, కుర్మయ్య, మహమ్మద్ పాల్గొన్నారు.

## మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మైనార్టీ యువతీ,యువకులకు ఎంప్లాయిమెంట్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం, స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కె.నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా సైన్స్‌లతో పాటు డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోర్సులపై మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ఆపై చదువులు చదివి ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్,ఆదార్‌కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పాస్‌ఫోటోలు, జిల్లా కలెక్టర్ సముదాయంలోని మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందించాలని కోరారు.

# ధరణి పీడ విరగడయ్యింది..!

**భూ భారతితో సన్న, చిన్నకారు రైతులకు న్యాయం**
**రియల్ పేరిట ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఊరుకోం**
**ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** గత బీఆర్ఎస్ పాలకులు గడీల నిర్ణయాలను ప్రజలపై రుద్ది సన్న, చిన్న కారు రైతులకు నష్టం చేకూర్చుతూ అన్యాయం జరిగేలా రూపొందించిన ధరణి పీడ విరగడయ్యిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ ప్రభుత్వం కీలక బిల్లును సభలో భూ భారతి బిల్లును ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వివరించారు. శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టం సభలో ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. గత ఎన్నికల్లో తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని హామీ ఇచ్చిన విధంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా మేధావులు, ప్రజాసంఘాల సూచనలు, సలహాలు తీసుకొని భూ భారతిని పటిష్టంగా రూపొందించడం జరిగిందని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. ఆర్‌వోఆర్ 2020ను కూడా ప్రభుత్వం పూర్తిగా ప్రక్షాళన చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారుల దగ్గర పరిష్కారం కావాల్సినవి కూడా కోర్టులకు చేరాయని ఎమ్మెల్యే చెప్పారు. భూ యజమానికి తెలియకుండానే భూమి చేయి దాటిపోయిందని ప్రస్తావించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త ముసాయిదా సిద్ధం చేశామన్నారు. పలు రాష్ట్రాల్లో ఆర్‌వోఆర్ చట్టాలను పరిశీలించి ఈ చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటన్నింటినీ సరిదిద్దేలా కొత్త ముసాయిదా తీసుకువచ్చామని తెలిపారు. తహసీల్దార్లతో పాటు ఆర్డీవోలకు మ్యుటేషన్ చేసే అధికారం ఇచ్చేలా ముసాయిదా రూపొందించారని, మ్యుటేషన్ సమయంలో విచారణకు అవకాశం కల్పిస్తుండగా.. తప్పుగా తెలితే మ్యుటేషన్ నిలిపివేసే అధికారాలను కట్టబెట్టనుందని ప్రతి భూ కమతానికి భూ ఆధార్ ఉండనుందని హక్కుల బదలాయింపు జరగ్గానే గ్రామ పహణీలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామని, అప్పీల్, రివిజన్‌లకు వెసులుబాటు కల్పిస్తూ బిల్లును రూపొందించారన్నారు. గతంలో అప్పీల్‌కు అవకాశం లేకుండా చట్టం చేశారని ఎమ్మెల్యే శంకర్ చెప్పుకొచ్చారు. ఆర్‌వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారులు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు. ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుందన్నారు. ధరణి చట్టాన్ని అడ్డంగా పెట్టుకొని గత బీఆర్ఎస్ పాలకులు చేతికి అందినకాడికి దోచుకున్నారని, పేద ప్రజల భూములను వివాదాల్లో పెట్టి కోట్లు దండుకున్నారని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో కూడా గత పాలకులు దోచుకొని ఎంతో దాచుకున్నారని విమర్శించారు. భూదందాల్లో రాటుదేలారని విమర్శించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటూ దందా చేస్తామంటే తాట తీస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. తన హయాంలో అలా నడవదని అన్నారు. ఎవరైనా దందా చేసుకుంటే ధర్మబద్దంగా చేసుకోవాలని అన్నారు. ప్రజల ఆస్తులకు, ప్రజల భూములను, ప్రభుత్వ భూములను అడ్డగోలుగా లాక్కుంటామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గతంలో రెండు వెంచర్ల నిర్వాహకులు ప్రభుత్వ భూముల విషయంలో అనేక అరాచకాలకు పాల్పడ్డారని, వాటి గురించి అసెంబ్లీ జీవో అవర్స్‌లో చర్చిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రియల్టర్లు ఎవరైనా తనను కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధర్మంగా చట్టాలకు లోబడి నిబంధనల ప్రకారం రియల్ వెంచర్లు చేసుకోవచ్చని తన వద్దకు పైరవీలకు ఎవరు రాకూడదని ఖరాఖండిగా చెప్పారు.

**జర్నలిస్టులకు, ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు**

షాద్‌నగర్‌లో జర్నలిస్టులకు, ఉద్యమకారులకు ప్రత్యేకంగా ఇండ్ల స్థలాల సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మార్చి నాటికి ఇది కార్యరూపం దాల్చే విధంగా సంబంధిత మంత్రులతో మాట్లాడుతున్నట్లు ఎమ్మెల్యే మీడియా సమావేశంలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో త్యాగాలకు పాల్పడ్డ వారికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చే విధంగా ఇళ్ల స్థలాలు ఇస్తుందని, అదేవిధంగా నిత్యం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా తన వంతు కృషి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.





చేవెళ్ల గ్రామం

## చేవెళ్ల మున్సిపాలిటీలో 12 గ్రామ పంచాయతీలు విలీనం

**చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటుకు శాసనసభ ఆమోదం**
**మున్సిపాలిటీ పరిధి నిర్ధారణకు మున్సిపల్ శాఖ కసరత్తు**

**చేవెళ్ళ, డిసెంబరు 20, ప్రభాతవార్త**

చేవెళ్ల మున్సిపాలీటిని 12 గ్రామ పంచాయతీలను విలీనం కానున్నాయి. చేవెళ్ల మున్సిపాలిటీగా 12 గ్రామ పంచాయతీలను కలిసి ఏర్పాటు చేస్తున్నట్టు ఆసెంబ్లీ అమోదం తెలిపింది. చేవెళ్ల గ్రామ పంచాయతీతో పాటు మరో 12 పంచాయతీలను కలిసి చేవెళ్ల మున్సిపాలిటీగా మార్చుతున్నట్లు ప్రతి పాధనలు సిద్దం చేశారు. చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ శాసనసభలో మాత్రం శ్రీధర్‌బాబు ప్రకటించారు. చేవెళ్ల, దామరిగిద్ద,ఇబ్రహింపల్లి, రామన్నగూడ, దేవునిఎర్రవల్లి,కెసారం, మల్కాపూర్,ఉరెళ్ల,పల్గుట్ట, కందవాడ, మల్లారెడ్డిగూడ, పామెన గ్రామాలను కలిసి చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటుకు ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేసింది.చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటుకు ప్రతిపాధనలు చేసి అధికారులు ప్రభుత్వంకు సమర్పించారు. ప్రభుత్వం చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటు ప్రభుత్వం చేస్తున్నట్లు ప్రకటించింది.చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటుకు దాదాపుగా ఏర్పాట్లు పూర్తయ్యయని, రెపు అధికారికంగా ఉత్తర్వులు జారీ కానున్నట్లు అధికారులు తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీకి ప్రభుత్వం అమోదం తెలిపింది.చేవెళ్ల మండల కేంద్రంకు సుమారు 5 నుండి 7 కిలోమిటర్‌ల పరిధిలోని గ్రామాలను కలుపుతూ చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటు కానుంది.

## కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల 10వ రాష్ట్ర స్థాయి క్రీడల పోటీలు కమ్మదనం సంక్షేమ గరుకులంలో రెండవ రోజు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఇటీవలే ప్రారంభమైన ఈ క్రీడా పోటీలు శనివారంతో ముగియనున్నాయి. తెలంగాన రాష్ట్రంలోని ఏడు జోన్‌ల నుండి అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభా గాల్లో 1190 మంది విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. ఈ క్రీడా పోటీలు పారదర్శకంగా, క్రీడా స్ఫూర్తితో నిర్వహిస్తున్నట్లు మల్టీ జోనల్ ఆఫీసర్ రజని, జోనల్ అధికారులు నిర్మల, ఫ్లారెన్స్ రాణి, కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విద్యుల్లతలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిను లు వచ్చే నెలలో నిర్వ హించే ఇంటర్ సొసైటీ రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని క్రీడల నిర్వహణ ఫిజికల్ డైరెక్టర్ ఉదయభాస్కర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలకు ఈనెల 21న సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గురుకులంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ, సాయంత్రం వేళల్లో విద్యార్థినులచే నిర్వహింపబడే సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

## సిఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

### కబడ్డీ పోటీల్లో రాష్ట్రష స్థాయికి ఎంపికైన జట్టు

**కొడంగల్,డిసెంబరు 20ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సీఎం కప్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి కబడ్డీ పోటీలకు విద్యార్థినీ విద్యార్థులు హాజరైయ్యారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 14 బాలికల,18 బాలుర జట్లు కబడ్డీ పోఈల్లో పాల్గొన్నాయి.సాయంత్రం వరకు కొనసాగిన కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో మొదటి బహుమతి కొడంగల్ జట్టుకు,ద్వితీయ బహుమతి మర్పల్లి,తృతీయ బహుమతి పరిగికి,అలాగే బాలికల విభాగంలో మొదటి బహుమతి తాండూర్‌కు,ద్వితీయ బహమతి బొంరాస్‌పేట్‌కు, తృతీయ బహమతి కుల కచర్లకు వచ్చాయని పీడీలు అనిల్‌కుమార్,అజీజ్‌లు తెలిపారు.వికారాబాద్ జిల్లా నుంచి మొత్తం ఆరు జట్లు రాష్ట్ర స్ధాయి సీఎం కప్ టోర్నమెంట్ కబడ్డీ పోటీలకు ఎంపికైయ్యారిని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీఈటీలు,ఉపాధ్యాయులు,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

**షాబాద్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు, సమతా సైనిక్ దళ్ మండల అధ్యక్షులు దేశమళ్ల కృష్ణ అన్నారు. శుక్రవారం షాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన ఫోటోలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ఈరోజు పార్లమెంట్‌లో ఉన్నతమైన పదవిలో ఉంటూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుండి తొలగించాలని, ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేదం టే ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు పెట్టి జైలుకు పంపాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బేగరి రాజు, నాయకులు శివశంకర్, బాల్‌రాజ్, నర్సింలు, సుధాకర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



# మున్సిపాలిటీ ఆదాయ వ్యయాలపై సమాచారం ఇవ్వాలి

### దిశా కమిటీ మెంబర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి



మున్సిపల్ కమిషర్‌కు వినతిపత్రం ఇస్తున్న దిశ కమిటీ మెంబర్ రాజశేఖర్‌రెడ్డి

**వికారాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** వికారాబాద్ మున్సిపాలిటీ ఆదాయ వ్యయాలపై పూర్తి స్థాయి సమాచారం ఇవ్వాలని కోరుతూ దిశా కమిటీ మెంబర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, వికారాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి ప్రజల అవసరాల నిమిత్తము, చేయబోయే అభివృద్ధి కార్యాచరణ కోసం తగు సమాచారాన్ని కమీషనర్‌ను కోరడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య సమస్యల వెచ్చిస్తున్న ఖర్చు, ప్రతి కాలనీలో రోజు చెత్త తీసుకురావడానికి వినియోగిస్తున్న వాహనాలు ఎన్ని, వాటి ఖర్చు వివరాలు అందజేయాలని వినపత్రంలో కోరడం జరిగిందన్నారు. పురపాలక పరిధిలోని వీధి దీపాలు ఎన్ని అమర్చారు. వీటికి సంవత్సరానికి అవుతున్న ఖర్చు ఎంత, ఇంకా వీధి లైట్లు లేని స్తంభాలు వికారాబాద్‌లో ఎన్ని ఉన్నాయో తెలుపాలని కోరడం జరిగిందన్నారు. దోమల మందు ఎన్ని రోజులకు ఒకసారి స్ప్రే చేయడం జరుగుతుందని, వికారాబాద్‌లో దోమల మందు స్ప్రే చేయడం లేదని ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. దోమల మందు స్ప్రే చేయడానికి ఎంత ఖర్చు అవుతుందని కమీషనర్‌ను అడగటం జరిగిందని పేర్కొన్నారు. మునిసిపాలిటీలో పార్కింగ్ స్థలాలు లేకుండా ఇళ్ళకి పర్మిషన్స్ ఎలా ఇస్తున్నారని, ఇంటి స్థలం తో పాటు రోడ్లను ఆక్రమించుకున్న వారి పై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటని, పలు కాలనీలలో నడిరోడ్డు పైన కార్లు పార్కింగ్ చేయడానికి షెడ్ల నిర్మాణం జరుగుతుందని, ఈ విషయమై ఏమైనా నోటీసులు ఇచ్చారా అని వినతి పత్రం ద్వారా ప్రశ్నించామని అన్నారు. వికారాబాద్ మునిసిపాలిటీలో కుక్కలకి ఆపరేషన్ ఏమైనా చేస్తున్నారా, వీటికి అయిన ఖర్చు ఎంత, ఇప్పటివరకు ఎన్ని ఆపరేషన్లు చేయించారనే వివరాలు కోరినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్లలో గల పార్కింగ్ ప్రదేశాలలో పిల్లలు ఆడుకోవడం కోసం ఏదైనా సదుపాయాలు సమకూర్చారా, సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఎవరిదని ప్రశ్నించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో కాలనీలలో గడ్డి తొలగించడానికి సంవత్సరానికి అయ్యే ఖర్చు, ఏ విధంగా గడ్డి తొలగింపు చర్యలు చేపడుతున్నారు, దీనికి ఎంత మంది సిబ్బందిని వినియోగిస్తున్నారో తెలుపాలని కోరడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలో ఎంత మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఎంత వేతనాలు చెల్లిస్తున్నారో తెలుపాలని కోరడం జరిగిందన్నారు. అనంతగిరి గుట్ట జాతర సందర్భంగా మునిసిపాలిటీ ద్వారా ఖర్చు చేసిన నిధులు ఎన్ని, వాటికి సంబంధించిన సంపూర్ణమైన నివేదిక ఇవ్వాలని, వ్యాపార దుకాణాలకి పర్మిషన్స్ ఉన్నాయా, లేని షాపుల పై ఏమైనా చర్యలు తీసుకుంటారా, ప్రతి షాప్ కు పర్మిషన్లకి తీసుకున్న డబ్బులు ఎంత, వాటి ద్వారా మున్సిపాలిటీగా వస్తున్న ఆదాయం ఎంత అని పలు ఆదాయ వ్యయాలకు సంబంధించిన సమాచారాన్ని త్వరితగతిన ఇవ్వాలని కమీషనర్‌ను కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శివరాజ్, యాదగిరి, రాఘవేందర్ ఉన్నారు.

# శ్రీనిధి ఋణ పంపిణీ సత్వరమే పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లాలో బ్యాంక్ లింకేజి, శ్రీనిధి రుణాల పంపిణి త్వరితగతిన పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం కల్లెక్టరేట్ కాన్ఫరెన్సు హాలు నందు గ్రామీణ అభివృద్ధి అధికారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ, మహిళా సంఘాలు రుణాలు, భీమాను వినియోగించుకోవాలని తెలిపారు. 60 సంవత్సరాల లోపు ఉన్న మహిళ సంఘం సభ్యులు తీసుకున్న బ్యాంక్ రుణాలకు ప్రభుత్వం మార్చి 14 నుంచి ఉచిత రుణ సౌకర్యం కల్పించిందని, ప్రమాద భీమా పథకాన్ని అమలు చేస్తుందని అయన పేర్కొన్నారు. రుణ భీమా తీసుకున్న సభ్యురాలు చనిపోతే ఆమె యొక్క లోన్ కు సంబంధించిన ధృవీకరణ పత్రాలు మండల సమైఖ్యలో సమర్పించి లబ్ధి పొందాలని అయన సూచించారు. జిల్లాలో బ్యాంకు లింకేజి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు టార్గెట్ ప్రకారం రుణాలను అందించాలని, జిల్లా లక్ష్యాలను సాధించాలని ఆన్నారు. జిల్లాలో మహిళా సమాఖ్య సంఘాలకు బ్యాంకు లింకేజి, శ్రీనిధి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు రుణాలను టార్గెట్ ప్రకారం రుణాలను పంపిణీ. లక్ష్యానికి అనుగుణంగా పంపిణీ చేయాలని తెలిపారు. రుణాల పంపిణీ తో పాటు రికవరీ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి వారం గ్రామీణ అభివృది అధికారి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించాలని, రికవరీల పై ప్రత్యేక శ్రద్ధ కనబరాచాలని పేర్కొన్నారు. లోన్లు తీసుకునేటప్పుడు ఏవైనా సమస్యలు ఏర్పడితే అధికారి దృష్టికి తీసుకురావాలని, క్లెయిమ్ లకు సంబంధించిన రిపోర్ట్ సబ్మిట్ చేయాలనీ ఆదేశించారు. లోన్ల పై అందరికి అర్ధమయ్యేటట్లు చెప్పి, బ్యాంక్ లింకేజి రికవరీ లు 100 శాతం పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. టూ వీలర్ పైన మొబైల్ క్యాంటీన్, బ్రౌన్ రైసు, మిల్లెట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృధి అధికారి శ్రీనివాస్, ఏపీడీ సరోజ, శ్రీనిధి ఆర్.ఎం ఉదయకుమారి, డీపీఎం లు, ఏపీఎం లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో ఆశావర్కర్ల ర్యాలీ



సిద్ధిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆశావర్కర్లను కేంద్రప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి కనీసవేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు రాష్ట్రకార్యదర్శి పద్మ డిమాండ్‌చేశారు. ఆశా కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్ల బస్ జాతా శుక్రవారం సిద్ధిపేట జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా సిద్ధిపేట పాతబస్టాండు నుంచి ప్రెస్‌క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎఎన్‌సి, బిపి టెస్టుల టార్గెట్ పెట్టొదని, స్పూటం డబ్బాలను తేవాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా 10 లక్షలమంది నిరుపేదలు ఆశావర్కర్లుగా పనిచేస్తూ పేదలకు వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించారని తెలిపారు. డబ్ల్యుహెచ్ఓ అంతర్జాతీయ సంస్థ ఆశావర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును ఇచ్చిందని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్న లెప్రసీసర్వేల డబ్బులు ఇవ్వాలన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు సిఐటియు అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. అనంతరం వైద్య ఆర్యోగశాఖ అధికారికి పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశావర్కర్ల ప్రతినిధులు గోపాలస్వామి, భాస్కర్,రవికుమార్, జయలక్ష్మి, నీలాదేవి, ప్రవీణ, మంజుల, భాగ్యలక్ష్మి, భాగ్య, కవిత, లక్ష్మి, శోభ, జ్యోతి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై కేసు నమోదు చేయడం సరికాదు



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** వ్యక్తిగత కక్షతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, గుండు భూపేష్‌లు అన్నారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అవినీతి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తుందని ఫార్ములా ఈ రేసులో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతీకార పాలనకు, పాపిష్టి పాలనకు ఇది ఉదాహరణ అన్నారు. గతయేడాది నుంచి కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులను తిట్టని రోజు లేదన్నారు. కేసులకు భయపడే ప్రసక్తిలేదన్నారు. ఫార్ములా ఈ రేస్ వలన రాష్ట్రప్రభుత్వానికి రూ.700కోట్ల లాభం వచ్చిందని నెల్సన్ అనే సర్వే ఇప్పటికే చెప్పిందని గుర్తుచేశారు. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి కానీ ప్రత్యర్థులను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోవాలి తప్ప ప్రతీకారదాడులు చేయడం సరికాదన్నారు. సమావేశంలో రాగుల సారయ్య, నాగుల ప్రశాంత్‌గౌడ్, గుజ్జ రాజు, శ్రీకాంత్, రాజశేఖర్, నాగరాజు, పర్శరాములు పాల్గొన్నారు.

## పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తా

-పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి




సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ వి.నరేందర్‌రెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** పట్టభద్రుల సంక్షేమానికి,, నిరుద్యోగ యువత సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి మెదక్, కరీంనగర్ నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్యే అభ్యర్థి ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ ప్రాంతంలో ఐటిఐని ఏర్పాటు చేయిస్తానన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ముక్కు పిండి వసూలు చేస్తున్న ఫీజులను వసూలు చేయకుండా కళాశాలలకు ఫీజ్ రియాంబర్స్‌మెంట్ ఇప్పిస్తానని, ఇతర జిల్లాల్లో అసలు ఫీజులు వసూలు చేయడంలేదని గుర్తు చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి జిపిఎఫ్ అమలు చేసే విధంగా కృషి చేస్తానని హామీ చేశారు

## అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి



**కొడంగల్,డిసెంబర్ 20ప్రభాతవార్త**

ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానపిరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పసదవి నుంచి బర్తరఫ్ చేయాలని దౌల్తాబాద్ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శ్యామ్ సుందర్,కొడంగల్ తాలూకా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు,ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి,కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ రాజుకుమార్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు.శుక్రవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ సంఘాల అద్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొన్నన జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగం కల్పించిన హక్కు తోటి ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడిగా ఉండి ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానపరిచేలా మాటా ్లడినందుకు ఆయనను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని,తక్షణమే అమిత్‌షా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల నాయకులు మలే అంజి,భీములు,అల్లాపురం భీములు,అన్నారం సాయిలు,బాలప్ప,రాములు, సిద్దప్ప, మహిపాల్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిసి కెమెరాల ఆధారంగా పట్టుబడిన చైన్‌స్నాచర్లు

### పేట్‌బషీరాబాద్ ఎసిపి రాములు
### పది రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసుల వైనం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పేట్‌బషీరాబాద్ ఎసిపి కె.రాములు పాల్గొన్న సిఐలు శ్రీనాథ్, గంగాధర్, నాయుడు, ఎస్ఐలు. సిబ్బంది దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లిలో ఓ వృద్ధ మహిళ (55) మెడలో నుంచి బంగారు గొలుసును చోరీ చేసిన ఇద్దరు చైన్‌స్నాచర్స్‌ను సిసి కెమెరాల ఆధారంగా పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసినట్లు పేట్‌బషీరాబాద్ ఎసిపి కె.రాములు తెలిపారు. పది రోజుల్లోనే చైన్‌స్నాచర్ల కేసును శామీర్‌పేట పోలీస్ సిఐ, డిఐ, మేడ్చల్ సిసిఎస్ సిఐ వారు బృందాలుగా ఏర్పడి సిసి కెమెరాల ద్వారా ఎట్టకేలకు కేసును ఛేదించారు. శుక్రవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన చైన్‌స్నాచర్స్ అరెస్ట్, రిమాండ్‌ను, చోరీ సంఘటన వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా పేట్‌బషీరాబాద్ ఎసిపి కె.రాములు మాట్లాడుతూ, ఈనెల 10వ తేదీన మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధమహిళ వ్యవసాయ పొలంకు వెళ్లి వడ్లను ఎండబెట్టటానికి వెళ్తుండగా ఎంసిపల్లిలోని రామాలయం దగ్గరకు చేరుకోగానే స్కూటీపై హెల్మెట్ ధరించి ఇద్దరు చైన్‌స్నాచర్స్ ఆమెను వెంబడించి బెదిరించి బంగారు గొలుసును లాక్కెళ్లటం జరిగింది. అయితే ఆమె ఎదిరించటంతో కొంత బంగారు గొలుసు తెగటం, మిగిలిన 5.5గ్రాముల బంగారు గొలుసు మాత్రమే దొంగలు లాక్కెల్లి చోరీ చేశారని వివరించారు. అయితే పోలీసులకు సమాచారం అందిన వెంటనే పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారని అన్నారు. సిసి కెమెరాలు దాదాపు సుమారు 6నుంచి7వందల వరకు మూడుచింతలపల్లి నుంచి పరిసరాలు, పలువైపుల రూట్లలో, బోడుప్పల్ వరకు పరిశీలించటం జరిగిందన్నారు. సుమారు 60నుంచి 70కిలోమీటర్ల దూరం వరకు సిసి కెమెరాలు పదిరోజుల నుంచి పరిశీలించినట్లు వాటి ఆధారంగ బోడుప్పల్‌లో సిసి కెమెరాల ద్వారానే చోరీ చేసిన ఇద్దరు దొంగలను (చైన్‌స్నాచర్లను) శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకుని విచారించి అరెస్టేచేసినట్లు, రిమాండ్‌కు తరలించటం జరుగుతుందన్నారు. అయితే ఈ చైన్‌స్నాచర్స్ కేసులో ఇద్దరు నూనె అంజిరెడ్డి (34), బండ్లగూడ, కీసరమండలంలో నివాసం ఉంటారని, ఆయన స్వంతగ్రామం మాదాపూర్ కరీంనగర్ జిల్లా అని అన్నారు. మరొకరు సందిటి నరేందర్ రెడ్డి అలియాస్ నవీన్‌రెడ్డి (34), డ్రైవర్ అని, వెంకట్రాంరెడ్డి కాలనీ, బొలిగూడెం, బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఆయన స్వంత గ్రామం కాత, నాగునూర్ మండలం, సిద్ధిపేట్ జిల్లావాసులు అని అన్నారు. అయితే ఎ1గా ఉన్న నిందితునిపై కేశవపట్నంలో, కరీంనగర్ జిల్లాలో మూడు కేసులు ఉన్నట్లు, ఒకటి సూసైడ్ యత్నం, వేధింపులు, ఇతరకేసులు ఉన్నట్లు ఎసిపి వివరించారు. నిందితులు ఇద్దరు కూడ వేర్వేరు ఐటి కంపెనీలోలలో క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, ఆర్థిక సమస్యలు, బోగవిలాసాల అవసరాల డబ్బు కోసం నగరంశివారుల్లో దోపిడి చేయాలని నిర్ణయించుకున్నట్లు మూడుచింతలపల్లిలో మహిళ మెడ నుంచి బంగారు గొలుసును లాక్కెటం జరిగిందని ఎసిపి కె.రాములు వివరించారు. వీరి నుంచి 5.5గ్రాముల బంగారు గొలుసును రికవరీ చేసి వారి నుంచి ఒకస్కూటీ, ఒకకారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవటం జరిగిందని ఎసిపి వివరించారు. పదిరోజుల్లోనే కేసును ఛేదించిన శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, డిఐ గంగాధర్, మేడ్చల్ సిసిఎస్ సిఐ దాలి నాయుడు, వారి బృందాలను సైబరాబాద్ సిపి అవినాశ్ మహంతి సూచనల మేరకు మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి పర్యవేక్షణలో డిసిపి క్రైమ్ నర్సింహ్మా, పేట్‌బషీరాబాద్ ఎసిపి కె.రాములు నాయకత్వంలో పనిచేసిన ఆయా సిఐలను, ఎస్ఐలను, సిబ్బందిని సిపి అభినందించారు. ప్రజలు కాలనీల్లో, పరిసరాల్లో చౌరస్తాల వద్ద, ఇళ్లవద్ద సిసికెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నివిధాల భద్రతకు దోహదపడ తాయని ఎసిపి కె.రాములు సూచించారు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మత్తు పదార్థాలు కలిగి ఉండడం నేరం

కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్



డాగ్ స్కాడ్స్‌తో కిరణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**కొండపాక, డిసెంబరు 20, ప్రభాతవార్త :** పిల్లలు గంజాయి ఇతర మత్తు పదార్థాల బారినపడకుండా తల్లిదండ్రులు వారిపై ఓ కన్నేసి ఉంచాలని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కుకునూరుపల్లిలో కిరాణా షాపులు, పాన్ షాపులల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిపి అనురాధ అదేశాల మేరకు గంజాయి ఇతర మత్తుపదార్థాలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మత్తుపదార్థాలు, గంజాయి, మత్తుతో తయారు చేసిన చాక్లెట్లను కలిగి ఉన్నా, నిలువచేసి అమ్మినా, రవాణాచేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరి వద్దనైన గంజాయి, మత్తు పదార్థాలు అక్రమంగా కలిగి ఉంటే వెంటనే 100నెంబర్‌కు లేదా 1908 నెంబర్‌కు సమాచారం ఇచ్చి సమాజ అభివృద్ధికి సహకరించాలని అయన కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ, డాగ్ స్కాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బంగారు, వెండి పతకాలు



కిక్ బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు తదితరులు

**నర్సాపూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** సిఎంకప్ క్రీడోత్సవాల్లో భాగంగా శుక్రవారం నర్సాపూర్‌లోని బాలుర ఉన్నతపాఠశాలలో కిక్ బాక్సింగ్, ఉష్మా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలోవిజయం సాధించిన క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు అందజేశారు. ఈ పోటీలకు మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో నుండి 100మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ మేరకు కిక్ బాక్సింగ్ పోటీల్లో 18మంది క్రీడాకారులు విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికకాగా ఇందులో 9మంది బాలురు, 9మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా ఉష్మ క్రీడల్లో సబ్‌జూనియర్ 8 విభాగంలో 6మంది బాలికలు 6మంది బాలురు విజయం సాధించారని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో 6మంది బాలురు 5మంది బాలికలు విజయం సాధించి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. నర్సాపూర్‌లో జరిగిన క్రీడల్లో ప్రథమ, ద్వితీయస్థానాల్లో రాణించిన క్రీడాకారులకు బంగారు, వెండిపతకాలు అందించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే అధికారులకు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు

**నర్సాపూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేచేస్తున్న సర్వే అధికారులకు, వార్డు అధికారులకు దరఖాస్తుదారులు సహకరించాలన్నారు. ఐదోవార్డులో మొత్తం 232 ఇళ్లకు గాను ఇప్పటివరకు 176ఇళ్ల సర్వేచేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన 56 ఇందిరమ్మ ఇండ్లను ఇదే తరహాలో సర్వే చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పట్టణంలోని అన్నివార్డుల్లో కూడా కొనసాగిస్తామని తెలిపారు. పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు సర్వే చేస్తున్న అధికారులకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో సర్వే అధికారులు వార్డు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి రంగానికి కోరమండల్ ఎంతో ఉపయోగం



**అత్తాపూర్ డిసెంబరు20,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల భాగంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ స్టాల్ ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో కోరోమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రత్యేకమైన గ్రేడ్ ఎరువుల గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా గోదావరి కార్బన్ ప్లస్,కే-రిచ్,ఎన్-రిచ్ వంటి జైవిక ఎరువులకు వర్తింపజేయాలని సూచించారు.కోరోమండల్ తాజా సాంకేతికతను ఉపయోగించి తయారు చేసిన గ్రోమోర్ నానో డిఎపి గురించి వివరించారు.ఈ నానో డిఎపి టెక్నాలజీతో సంప్రదాయ కాంప్లెక్స్ డిఎపి వినియోగాన్ని 25శాతం వరకు తగ్గించుకోవచ్చాని వెల్లడించారు.ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ సుభారెడ్డి మాట్లాడుతూ...కోరోమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వ్యవసాయ సామాజానికి అందిస్తున్న సేవలను వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యతను వివరించారు.ఇటీవల కోరోమండల్ సంస్థ గ్రోమర్ డ్రైవ్ పేరిట డ్రోన్ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించారు.

## అమిత్ షాను పదవి నుంచి సస్పెండ్ చేయాలి




**అత్తాపూర్ డిసెంబరు20,ప్రభాతవార్త :** డా.బిఆర్ అంబేద్కర్‌ను కించపరిచి బిజెపి హోంశాఖ మంత్రి అమిత్ షా ను వెంటనే పదవి నుంచి సస్పెండ్ చేయాలని పత్యారా నర్సింహా,గోడుగు సంజీవ డిమాండ్ చేశారు.పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాజేంద్రనగర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అమిత్ షాను వెంటను పదవి నుంచి తొలగించాలని ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని సూచించారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన

**వికారాబాద్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** డప్పు చప్పుళ్ళతో..శివ సత్తుల పూనకాలు..పోతు రాజుల విన్యాసాలతో వికారాబాద్‌లో బోనాల పండుగను తలపించేలా సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన తెలిపారు. శుక్రవారం తో వారి నిరసన 15వ రోజుకు చేరుకోవడంతో వినూత్నంగా నిరసన చేపట్టారు. తెలంగాణ సంప్రదాయ పండుగ అయిన బోనాల పండుగను గుర్తుకు తెచ్చేలా నిరసన చేపట్టడంపై పట్టణ ప్రజలు వారిని ఆశ్చర్యంగా తిలకించారు. శుక్రవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన 15వ రోజుకు చేరుకోవడంతో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ బోనాలు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుండి ఎమ్మార్పీ చౌరస్తాలో ఉన్న అమ్మవారి దేవాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీలో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కేతావత్ గాంగ్యానాయక్ మాట్లాడుతూ, సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్దీకరణ చేసి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 575 మంది సమగ్రశిక్షా ఉద్యోగులు గత 15 రోజులుగా సమ్మె చేపడుతున్నారన్నారని, ఎంఆర్సీ, సీఆర్సీ, పాఠశాల, కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్, డీపీఓ స్థాయిలో అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొని సమగ్రశిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలని సమ్మెకు దిగడం జరిగిందన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, వెంటనే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్‌లో సమగ్రశిక్ష కు అనుబంధంగా పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో మెసెంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, మహిళా నాయకురాలు ప్రభావతి, డీపీఓ శేఖర్, పీటీఐ రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాలల ఎసీలు ఆశాలత, స్వరూప, శైలజా, రాధిక, పల్లవి, దేవి, రాజేశ్వరీ, స్రవంతి, సుమిత్రా, చైతన్య, రఘుసింగ్, రఘు, వెంకట్ రెడ్డి, దశరథ్, మాధవి, మమత, మోహన్, జ్యోతి, ప్రియాంక, అనితా, రమాదేవి, విజయ్, నర్సింహులు, నాగయ్య, సమగ్రశిక్షా అన్నీ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

**కొండపాక, డిసెంబరు 20, ప్రభాతవార్త:** బందారం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు కొండపాకలో నిర్వహించిన సిఎం కప్ వాలీబాల్ పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రామచంద్రం తెలిపారు. శుక్రవారం అండర్ 18 విభాగంలో కొండపాక జట్టుకు ప్రథమబహుమతి లభించగా, బందారం విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు రాగుల దినేష్, కిన్నెర మహేష్, తేజ ఎంపికైనట్లు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో కొండపాక జట్టు ద్వితీయబహుమతి గెలుపొందగా బందారం విద్యార్థినులు చింతల అనూష, బట్ట అక్షయ, బట్ట రాణి, కిన్నెర భవాని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, బాలకనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాగ్యలక్ష్మి, మల్లారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కెటిఅర్‌పై అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలి

ఎంపిటిసిల మాజీ రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్



కుకునూరుపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న దేవి రవీందర్

**కొండపాక, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాజకీయంగా బిఅర్ఎస్‌పార్టీని ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ కుటుంబమే లక్ష్యంగా చేసుకొని అక్రమకేసులు బనాయిస్తుందని ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్‌ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆరోపించారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలకేంద్రంలో అయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా ప్రపంచనికి గొప్పగా పరిచయం చేసి, హైదరాబాద్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన కెసిఆర్‌ను గౌరవించాలని సూచించారు. నేడు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలపక్షాన నిలబడి ప్రభుత్వంపై చేస్తున్న పోరాటాన్ని తట్టుకోలేక అక్రమకేసులు పెట్టి ప్రతిపక్షనాయకుల గొంతు నొక్కాలని చూస్తుందని విమర్శించారు. యావత్ ప్రజనీకం కెటిఅర్ వెంటే ఉందని తగినసమయంలో కా ంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నరన్నారు. కెటిఆర్‌పై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యేడాది కాలంలోనే కాంగ్రెస్‌ను ఎందుకు గెలిపించామా అని ప్రజలు మదనపడుతున్నారని పేర్కొన్నారు. కా ంగ్రెస్ చేస్తున్న తప్పిదాలతో బిఅర్ఎస్ క్యాడర్ మరింత పటిష్టంగా తయారవుతుందని వివరించారు. ప్రతిపక్ష నాయకులపై కక్ష్యసాధింపు చర్యలు చేస్తే సిఎం రేవంత్‌రెడ్డికి త్వరలోనే పదవీగండం తప్పదన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బచ్చలి మహిపాల్,పాల రమేష్‌గౌడ్,మామిడి కృష్ణ, దినేష్ పాల్గొన్నారు.

## గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులుగా శ్రీనివాస్ ప్రభాకర్

**శామీర్‌పేట, డిసెంబరు 20,ప్రభాతవార్త**

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.వి.శ్రీనివాస్ ప్రభాకర్ (లాల్‌గడిమలక్‌పేట్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం) ఎంపికయ్యారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీనివాస్ ప్రభాకర్ రాష్ట్ర కమిటీ అసోసియేట్ అధ్యక్షులుగా తాను ఎంపిక కావటం సంతోషకంగ ఉందన్నారు. రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన అధ్యక్ష,కార్యదర్శులకు, కమిటీ వారికి వారికి ఆయన దన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర శాఖ, జిల్లా శాఖల వారి సహకారంతో ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటానికి తన వంతుగ కృషి చేస్తానని ఆయన అన్నారు. పాఠశాలల్లో విద్యారంగ సమస్యల పరిష్కారంకు, మౌళిక వసతులు కల్పనకు తనవంతుగ కృషి చేస్తానన్నారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన జిల్లా టిఎన్‌జిఓస్,హాస్టల్స్ నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 20, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్, హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఫోరం సభ్యులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను ఛాంబర్‌లో కలిసి జిల్లాలోని క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను, హాస్టల్స్‌లో అమలు అవుతున్న నూతన డైట్ విధానం (కామన్ మెనూ) ను వారు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఛాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని వారు అందజేశారు. మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్ ఆద్వర్యంలో హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులతో కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగ కలిసినట్లు జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్ తెలిపారు. కలెక్టర్ సమస్యల పట్ల సానుకూలంగ స్పందించారని, సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేధిస్తామని తెలిపినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టిఎన్‌జిఓస్), యూని యన్ జిల్లా కార్యదర్శి భరత్‌కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి ధేరవా త్ రజిని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ కేంద్ర ఫోరం ఉపాధ్యక్షులు పాండు, సుధాకర్‌రెడ్డి,టిఎన్‌జిఓస్ యూనియన్ హాస్టల్స్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు మాణిక్యం, కార్యదర్శి కమల్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం

**శామీర్‌పేట, డిసెంబరు 20, ప్రభాతవార్త**

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించే విధంగ మాట్లాడటం దారుణమని, దీన్ని నిరసిస్తూ ఖండిస్తూ శామీర్‌పేట మండల మాలమహానాడు నాయకులు పలువురు పాల్గొని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను మండల మాలమహానాడు నాయకులు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల మాలమహానాడు అధ్యక్షులు బొమ్మర్ల నాగరాజు, దళితసేన మండల ప్రధాన కార్యదర్శి నీరుడి బాలేశ్, లాల్‌గడిమలక్‌పేట్ అధ్యక్షులు కైర బాలు, మాజీ సర్పంచు కైర రమేశ్, మాజీ వార్డుసభ్యులు కనకల లింగం, నాయకులు సుధాకర్, కాళిదాస్, శ్రీకాంత్, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

**ఫెస్టివ్ స్టోర్‌తో క్రిస్మస్ ఆనందాన్ని సంబరంగా జరపుకోండి**

క్రిస్మస్ సందర్భంగా మీరు అభిమానించే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పి కూర్చిన ఆమేజాన్ ఇన్ వారి క్రిస్మస్ స్టోర్ నుండి చక్కని బహుమతిని కనిపెట్టండి. సెలవు రోజుల్లో ఆనందాన్ని కలిగించేందుకు ఇది మీ వన్‌స్టాప్ షాప్. డిసెంబర్ 18నుంచి డిసెంబర్ 25 వరకు స్టోర్ లైవ్‌గా ఉంటుంది. ఈ పండుగ సీజన్‌లో ఇంటి వద్దనే సుఖంగా ఉండి బహుమానాన్ని పంపించే ఆనందాన్ని పొందండి.

## శ్రీనివాస్ యాదవ్‌కు జర్నలిస్టుల పరామర్శ

**తలకొండపల్లి డిసెంబర్ 20, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సి ఎల్ శ్రీనివాస్ యాదవ్ గారి తండ్రి చీపిరి విశ్రాంత ప్రధానోపాధ్యాయు లు జంగయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల జర్నలిస్టులు గురువారం నాడు వారి స్వగ్రామం వెల్జాల్ గ్రామానికి వెళ్లి అతని ప్రథమ పుత్రుడు ,మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ ను పరామర్శించారు. చీపిరి జంగయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళుల ర్పించారు. సందర్భంగా ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు దరువుల శంకర్ మాట్లాడుతూ జంగయ్య సారు మండలంలోని రాంపూర్ గ్రామంలో అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతోమంది విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే తగ్గిందన్నారు ఆయన లేని లోటు అతని స్వగ్రామానికి మండల ప్రజల కు తీరనిలోటు అని ఈ సందర్భంగా వారు కొనియాడారు . అనంతరం అతని చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ప్రెస్ క్లబ్ తలకొండపల్లి మండల అధ్యక్షులు దరువుల శంకర్ , గౌరవ అధ్యక్షులు చీపిరి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు తిరుపతి, జర్నలిస్టులు వెంకటరెడ్డి , చంద్రకుమార్, మహేష్, రాజు, శేఖర్ జూలపల్లి సర్పంచ్ విజయ్ కుమార్ తోపాటు మిడ్జిల్, వంగూరు మండలాలకు చెందిన బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు తరలి వచ్చారు.

## అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ**



యాచారంలోని సాగర్ రహదారిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

**యాచారం డిసెంబరు 20, ప్రభాతవార్త** అమిత్ షా పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలని వెంటనే పార్లమెంటు సభ్యత్వం కి రాజీనామా చేయలని సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు జన్వెస్లి,మధు సుధన్ రెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ యాచారంలో సాగర్ రహదారిపై ధర్నా నిర్వహించి శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశ ప్రజలందరికీ ప్రధాని నరేంద్ర మోడీ,అమిత్ షా క్షమాపణలు చెప్పాలనీ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ ఆర్ఎస్ఎస్ మనువాదాన్ని తీసుకురావాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్ దళితుడు కాబట్టే ఆయనకున్న ఆదరణ చూసి ఓర్వలేక అమిత్ షా మాట్లాడడం దుర్మార్గం మన్నారు. ప్రపంచ దేశాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొనియాడుతుంటే భారత దేశంలోని మనువా దులు ఇలా మాట్లాడడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో బహుజనులే రాజ్యమేలుతారని మనువాదం అంతమ వుతుందని దీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి మధుసూ దన్ రెడ్డి, పగడాల యాదయ్య బి సామేల్, డి జగదీష్, సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, మండల కమిటీ కార్యవర్గ సభ్యులు పి అంజయ్య, పి బ్రహ్మయ్య, ఆలంపల్లి జంగయ్య, ఎస్ చందు నాయక్, మండల కమిటి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షాబాద్ పహిల్వాన్ షా దర్గా అభివృద్ధికి కృషి

**చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామెన భీం భరత్**



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నాయకులు

**షాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** షాబాద్ పహిల్వాన్ షా దర్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియో జకవర్గం ఇంచార్జి పామెన భీం భరత్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని షాబాద్ పహిల్వాన్ షా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దర్గాను సందర్శించి,ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ....షాబాద్ పహిల్వాన్ షా ఎంతో ప్రాముఖ్యత కలిగింద న్నారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, చల్లా మాధవరెడ్డి, ఆశోక్, రాహుల్‌గుప్తా, పెంటారెడ్డి గడ్డం చంద్రయ్య, నర్సింలు, ముస్లీం సోదరులు తదితరులు ఉన్నారు.

## వంద సంవత్సరాల ఉత్సవాలు నిర్వహించండి

## సిపిఐ జెండా ఆవిష్కరణలో రామస్వామి



**మొయినాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాలను ఘణంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ కె. రామస్వామి అన్నారు, శుక్రవారం మండలంలోని సిపిఐ కమ్యూనిస్టు పార్టీ జెండా ఆవిష్కరణ ఘణంగా నిర్వహించారు, ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ బిజెపి పార్టీకి భారత రాజ్యాంగ నిర్మాత పట్ల అస్యభ్యంగా మాట్లాడటం అలవాటుగా మారిందని, కేంద్ర హోంశాఖమంత్రి అమీత్‌షాని వెంటనే పదవి నుండి భరతరఫ్ చేయాలని, అతని పై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు, అంబేద్కర్ పేరు ప్రస్తావించే బదులు, భగవంతుని పేరు తలుచుకుంటే స్వర్గం దక్కుతుందని అన్న ఆయన అహంకార మాటలకు దేశమే సిగ్గుతో తలదించుకుంటుందన్నారు, అమిత్‌షాకు స్వర్గం కావాలంటే రాజకీయాల నుండి తప్పుకొని వెంటనే భగవంతుని ధ్యానం చేసి స్వర్గప్రాప్తి దక్కించుకోవాలని కోరారు, అమిత్‌షా పై తక్షణమే చర్యలు తీసుకొవాలని కోరారు, భారత కమ్యూనిస్టు పార్టీ వంత వసంతాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా మాట్లాడుతూ పార్టీ యొక్క జెండాలను గ్రామ గ్రామాన కార్మికులు, కర్షకులు ఎగరవేసి కమ్యూనిస్టు పార్టీ యొక్క గోప్పతనాన్ని ప్రజలకు చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి సిపిఐ కార్యాకర్తదని అన్నారు, పార్టీ యొక్క నిర్మాణానికి గ్రామ గ్రామాన కమీటీలు వేయాలని, కార్యాకర్తలను, బలోపేతం చేయడానికి నాయకులు నడుం బిగించాలని కోరారు, ఈ కార్యాక్రమంలో ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బికేఎంయు జిల్లా అధ్యక్షుడు జె. అంజయ్య, చేవెళ్ల మండల పార్టీ అధ్యక్షుడు ఎం సత్తిరెడ్డి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వడ్ల మంజూల, బిఓసి జిల్లా ఉపాధ్యాక్షుడు బోనాల ప్రభాకర్, పార్టీ సినియర్ నాయకులు మోహన్ రెడ్డి, జహంగీర్, యాదగిరి, నర్సింలు, వడ్ల రాములు, యశోద, రాజు, లక్ష్మణ్, బాల్‌రాజ్ గౌడ్, వెంకటేష్ తూర్పు నర్సింహులు పాల్గొన్నారు

### సల్మాన్‌ఖాన్ భాయ్‌కా బుడ్డే జరుపుకుందాం

ఈ డిసెంబర్‌లో బీయింగ్ హ్యూమన్ క్లోతింగ్ అభిమానులు ఫ్యాషన్ ప్రేమికులను ఈ సంవత్సరం యొక్క గొప్పసెలబ్రేషన్‌కు ఆహ్వాని స్తోం ది. భాయ్‌కా బుడ్డే వెయిట్‌లిఫ్టింగ్‌తో బంతాహై బీయింగ్ హ్యూ మన్ క్లోతింగ్ యొక్క ముఖచిత్రమైన సల్మాన్‌ఖాన్ తన పుట్టినరోజు జరుపు కుంటుండగా బ్రాండ్ ఈ ప్రత్యేక రోజును మరింత వినూత్నంగా మార్చి 25 నుంచి 27 డిసెంబర్ వరకు అన్ని కలెక్షన్లపై ప్రత్యేక ఫ్లాట్50 శా తం ఆఫర్‌అందిస్తోంది.



పోలీసుల అదుపులో ఏఐఎస్ఎఫ్ నాయకులు

## ప్రజా పాలనలో ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్**

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిందని, ఇందులో భాగంగా పోలీసులు అర్ధరాత్రి ఇంటికి వచ్చి ముందస్తు అరెస్టు చేయ డం సరికాదని, ఇదెక్కడి ప్రజాపాలన అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ అన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలలో ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు చనిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర హోంమంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మరాటి వివేక్**

**యాచారం,డిసెంబరు20, ప్రభాతవార్త** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబెద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో చేసిన వ్యాఖ్యలను నందివనపర్తి జై భీం ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మరాటి వివేక్ తీవ్రంగా ఖండించారు. గురువారం రోజు వివేక్ విలేకర్ల తో మాట్లాడుతూ ... ఈ దేశం ల్లో ని కోట్ల మంది దళితులు. అణగారిన వర్గాల ప్రజల ప్రతీక ఆరాధ్య దైవమైన అంబెద్కర్ పేరు ప్రస్తావించడాన్ని గౌరవంగా భావిస్తారని, హోమ్ మంత్రి వ్యాఖ్యలు అత్యంత ఖండనీయం అని అభిప్రాయపడ్డారు. అమిత్ ష వ్యాఖ్యలు భాజాపా యొక్క అంబెద్కర్ వ్యతిరేక వైఖరిని తెలియజేశాయని , ఆ పార్టీ పూర్వ రూపాలైన జన సంఘ్ ,ఆర్ ఎస్ ఎస్ రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో అంబెద్కర్ ని వ్యతిరేకించాయని గుర్తు చేశారు. అంబెద్కర్ రాసిన రాజ్యాంగమే లేకుంటే వారికి కేంద్ర మంత్రి పదవులు ఎక్కడివని, తక్షణమే తన వ్యాఖ్యలను పార్లమెంట్ సాక్షిగా ఉపసంహరించుకొని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం రాజకీ యాల కోసం మాత్రమే అంబెద్కర్ పేరుని వాడుకునే పార్టీలు, అంబెద్కర్ లేకపోతే మనుగడ ఎక్కడ అని ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. మనువాదుల ఆటలు ఇక సాగవని, అంబెద్కర్ వారసులు ఇక చేతులు కట్టు కోలేదని, తమ భవిష్యత్ తరాలు అంబెద్కర్ సిద్ధాంతలతో ముందుకు వస్తున్నా రని, మాటలు మాట్లాడేటప్పుడు తస్మాత్ జాగ్రత్త అని సూచించారు
పరిపాలన చేతగాక కాంగ్రెస్ ప్రతీకార పాలనకు పాల్పడుతుంది,
ప్రభుత్వాన్ని ఎండగట్టి, ప్రజలకోసం పోరాడుతున్నందుకా,

## పథకం ప్రకారంమే కేటీఆర్‌పై కేసు

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అన్నంత రెడ్డి**



**మొయినాబాద్, డిసెంబర్20, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం పాలించడం చాతగాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతికార పాలన తెలంగాణ రాష్టంలో కొనసాగు తుందని, ప్రభుత్వ పనితీరును ఎండగట్టి ప్రజల కోసం నిత్యం పోరాడుతున్న కేటీఆర్ పై పదకం ప్రకారమే ఏసిబి కేసు పెట్టారని, ఇది ప్రభుత్వ పిరికి పంద చర్యని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అన్నంతరెడ్డి ఆరోపించారు, బిఆర్ఎస్ హయంలోనే హైద్రాబాద్‌ను గత 70ఏళ్ళ పాలనకు మించి అభివృద్ధి చేసి, ప్రపంచలో పేరున్న ఎన్నో మల్టీనేషన్ కంపేనీలను హైద్రాబాద్‌కు రప్పించిన ఘణత మాజి ఐటి మంత్రి కేటీఆర్ ది, బిఆర్ఎస్ పార్టీదని అన్నారు, హైద్రాబాద్‌లో జాతీయ ఫార్ముల ఈ.కార్ రేస్‌ను హైద్రాబాద్‌లో ఏర్పాటుచేసి ప్రపంచంలోనే హైద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు, దేశంలో ఉన్న నిభందనల ప్రకారమే ఈ.కార్ రేస్ ఏర్పాటుచేశారని గుర్తుచేశారు, ఏక్కడా అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవని, కేటిఆర్ పై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అబండాలన్ని పూర్తిగా అవాస్తవమైనవన్నారు, హైద్రాబాద్‌లో అంతర్జాతీ య ఈ.కార్ ఫార్ముల రేస్‌ను ఏర్పటు చేయడం వల్ల ప్రపంచదేశాలు హైద్రబాద్ వైపు చూసి, నగరం అభివృద్ధిని గుర్తించి ఎన్నో పెద్ద,పెద్ద మల్టీనేషనల్ కంపెనీలు పెట్టుబడులు వచ్చాయని, గుర్తుచేశారు, ఫార్ముల ఈ కార్ రేస్ వల్ల రాష్టానికి పేరు ప్రఖ్యాతలు, ఆదాయ వనరులు పెరిగాడానికి నాటి ఐటి శాఖమంత్రి కేటీఆర్ చేసిన కృషి అని కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దని గుర్తుచేశారు, రాష్టానికి వెన్నుముఖ హైద్రాబాద్‌ను ప్రపంచ స్ధాయికి తీసుకెల్లిన మాజి ఐటి మంత్రి కేటీఆర్ పై కుట్రపూరితంగా ఓర్వలేకనే ఇలాంటి అబండాలు మోపుతున్నారన్నారు, ప్రభుత్వ పాలనను ఎప్పటికప్పుడు ఎండగట్టి ప్రజాగొంతుకై ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్నందుకా కేటీఆర్ పై ఏసిబి కేసు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిందన్నారు, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హమీలు నేరవేర్చడం చాతగాక, కేసిఆర్ రాష్టాన్ని ఏ విధంగా పాలించాడో ప్రజలకు తెలుసని, మీకు పరిపాలన చేతగాక పిరికి పందలా ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని గుర్తుచేశారు, కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ముందు ఎన్నికల్లో ఇచ్చిన హమీలను నేరవేర్చాలన్నారు, కేటిఆర్ పై ఈగవాలిన రాష్టం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు, ఈ కార్యాక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎండీ.రహూఫ్, నర్సింహ గౌడ్, మాజి పిఎసిఎస్ చైర్మెన్ జగన్ మోహన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజి ఎంపీటీసి మాణిక్‌రెడ్డి, షాబాద్ దర్శన్, డేవిడ్, పూసల పరమేష్, గునుగుర్తిచిన్న, మోత్కూపల్లి సునీల్, మోత్కూపల్లి కిరణ్, ఆసీఫ్, కర్రోళ్ల భాస్కర్, ఆసీఫ్, కరణ్, రాజు, ఆమేర్, అలీమ్, నమిలిగారి రవి తధితరులు పాల్గొన్నారు,

## యువతి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

**పెద్దేముల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** యువతి అదృశ్యమైన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన కీర్తన (20) ఈ నెల 18 నాడు ఇంటి నుంచి బయటకు వెళ్ళి ఇంతవరకు తిరిగిరా లేదు. కీర్తన తల్లిదండ్రులు వారికి తెలిసిన చోటల్ల, బందువుల వద్ద వెతికిన ఆచూకి లభించలేదు. కీర్తన తండ్రి హరిజన్ మానెప్ప పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## తప్పుడు వార్తలు ప్రచారం చేయడం తగదు

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** వాస్తవాలు వక్రీకరించి తనపై బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతుందని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం నాటి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన పరిణామాల గురించి ఎమ్మెల్యే శంకర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొం దించిన నూతన ఆర్వోఆర్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా బీఆర్ ఎస్ పార్టీ సభ్యులు నూతన ఆర్వోఆర్ చట్టాన్ని అడ్డుకునే క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లారు. అంతటితో ఆగకుండా బీఆర్ఎస్ శాసనసభ్యుడు కె.వివేకానంద్ సభ నయమావళికి విరుద్ధంగా ఉన్నత హోదాలో ఉన్న దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బుక్ విసిరారని వివరించారు. ఆ వెంటనే మరో బీఆర్ఎస్ శాసనసభ్యుడు కౌశిక్ రెడ్డి ప్లకార్డులు చించి స్పీకర్‌పై విసిరినందుకు నిరసనగా పేపర్ అందుకొని కౌశిక్‌రెడ్డిపై విసిరినట్లు తెలిపారు. పేపర్ విసిరితే దాన్ని చెప్పులు విసిరినట్లు అసత్య ప్రచారం చేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అసెంబ్లీ రికార్డులను పరిశీలిస్తే వాస్తవం తెలుస్తుందని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఎవరూ విశ్వసించరని, వాస్తవాలు వాటంతటవే బయటకు వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

### తాన్‌సేన్ సంగీత్ సమారోహ గిన్నిస్ ప్రపంచ రికార్డు

గ్వాలియర్ మహానగరంలోఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 100వ తా న్‌సేన్ సంగీత్ సమారోహ్ చరిత్ర సృష్టించింది. 546మంది హిం దుస్థానీ శాస్త్రీ య సంగీత విద్యాంసులు ఒకేసారి ఒకే వేదికపై కలిసి ఈ సంగీత్ సమారోహ్ లో పాల్గొనడం ద్వారా 100వ సంగీత్ సమారోహ గిన్నిస్ ప్రపంచ రికార్డుని సాధించింది. నిజంగా హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ఇందోక అద్భుతమైన మైలురాయిగా అభివర్ణించవచ్చు.

## ఇందిరమ్మ ఇండ్లసర్వేను పరిశీలిస్తున్న అధికారులు

**దోమ, డిసెంబరు 20 ప్రభాతవార్త.** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,సర్వే కార్యక్రమాన్ని సక్రమంగా సర్వే జరుపాలని దోమ మండల పరిషత్ అభివృద్ది అధికారి మహేశ్‌బాబు అన్నారు.సర్వే కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం నాడు బొంపల్లి, బాచుపల్లి, గొడుగోనిపల్లి,దోర్నల్‌పల్లి దోమ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన సంబందిత పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ దోమ మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో మొత్తం 14819 లబ్దిదారులు ప్రజపాలనలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.ఈరోజు వరకు 5200 లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన పంచాయతీ కార్యదర్శుల సహకారంతో పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. ఇచ్చిన గడువులోపల పూర్తి చేయుటకు ప్రతి గ్రామములోని దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు అందుబాటులో ఉండి ఆధార్ కార్డులు,డాక్యుమెంట్స్,టాక్సు రసిదు వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**తహశీల్దార్ విజయ్‌కుమార్**

**కొడంగల్,డిసెంబర్ 20ప్రభాతవార్త** విద్యార్దుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని,అందులో భాగంగా వసతిగృహాల్లోని విద్యార్దులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తు వారి విద్యాభివృద్దికి తోడ్పాటునందిస్తున్నదని తహశీల్దార్ విజయ్‌కుమార్,ఎస్సై సత్యనారాయణ,ఎంపీఓ స్పెషల్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ హనుమంత్‌రెడ్డి అన్నారు.శుక్రవారం కొడంగల్ పట్టణంలోని ఎస్టీ బాలుర వసతిగృహం,ఎస్సీ బాలుర,బాలికల హాస్టళ్ళలో విద్యార్దులకు స్వెటర్‌లు,ఉలెన్ రగ్గులను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యా ర్దులు సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్దిలో ఉన్నతస్థాయికి ఎదుగాలని తెలిపారు.కార్యక్రమంలో వార్డెన్ వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రిపై చర్యలు తీసుకోవాలి



**నవాబుపేట డిసెంబర్ 20,ప్రభాతవార్త :** పార్లమెంటులో భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పరిచిన కేంద్రహోం మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం దళిత నాయకులు నిరసన కార్యక్రమన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్‌స్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏసుదాసు, శివరాజు, శ్యాంరావు, సుదర్శన్, అశోక్, లక్ష్మన్, నర్సింలు, రత్నం, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి**



**కేశంపేట డిసెంబరు 20 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని కోనాయపల్లి, సంతాపూర్, కొత్తపేట, బొదునం పల్లి, లేమామిడి, నిర్దావెళ్లి, లింగంధన, కాకునూర్, సుందరాపూర్, వేముల్ నర్వ, అల్వాల్, మంగలి గూడ, మరియు ఎక్లాస్కంపేట్ గ్రామపంచాయతీ లలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిబంధనలను అనుసరించి క్షేత్రస్థాయిలో అన్ని వివరాలు సేకరించి ఎలాంటి అవకతవకలు లేకుండా వివరాలను నమోదు చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు రమేష్ కుమార్**



యాజమాన్యంతో మాట్లాడుతున్న యు.రమేష్

**పెద్దేముల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని బిజేపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు యు.రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం మారెపల్లి సుమిత్ర కాటన్‌మిల్లును మండలపార్టీ అధ్యక్షుడు హరీష్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సందీప్‌కుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. రైతులకు జరుగుతున్న ఇబ్బందులను మిల్లు యాజమాన్యంతో చర్చించారు. ఈ సందర్భంగా యు.రమేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా పండించిన పత్తిని నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ కేంద్రాలలో విక్రయించాలని అన్నారు. సీసీఐ కేంద్రాలలో దళారులకు తావివ్వకుండా కష్టపడ్డ రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని మిల్లు యజమానులకు సూచించారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజేపి ప్రధానకార్యదర్శి యాదయ్యగౌడ్, నాయకులు రాంచెందర్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై రెండు రోజుల ఉచిత మెగా క్యాంపు




మెగా క్యాంపులో పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** షాద్‌నగర్ డివిజన్‌లోని పోలీసులకు, వారి కుటుంబాలకు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్, ఇతర రోగాలపై రెండు రోజుల ఉచిత మెగా క్యాంపుని ఏర్పాటు చేసినట్లు ఏసీబీ రంగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీకులకు, వారి కుటుంబాలకు ఈసీజీ, ఎక్స్‌రే, కంటి పరీక్షలు, ఛాతీ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్లకు సంబంధించి ఉచితంగా మెగా క్యాంపు పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇప్పటికే పోలీసు కుటుంబాలకు సంబంధించిన వారికి 50 మందికి పరీక్షలు జరిగాయని, ఈ అవకాశం అందరు వినియోగించుకోవాలని ఏసీపీ రంగస్వామి కోరారు. సీపీ అవినాష్ బాబు, జాయింట్ సీపీ డేవిడ్ జోయల్, డీసీపీ రాజేష్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్, రూరల్ సీఐ నర్సయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ రమేష్‌బాబుకు, గ్రేస్ ఫౌండేషన్ వారికి ఏసీపీ రంగస్వామి ధన్యవాదాలు తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ నాయకుడు మహమ్మద్ పసివుద్దీన్

**శంషాబాద్. డిసెంబరు 20, ప్రభాతవార్త**



మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందే విధంగా చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కోరినట్లు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఫసిరుద్దీన్ తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొందించిందని ఆ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. ఆ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందితేనే ప్రభుత్వం ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. పథకాలు లబ్ధిదారులకు చేరితే ఆ కుటుంబాలు బాగుపడే అవకాశం ఉంటుందని తెలిపారు.

## తొండుపల్లి, కిషన్ గూడ వద్ద హైవేపై ఫుటోవర్ బ్రిడ్జి నిర్మించాలి



**శంషాబాద్. డిసెంబరు 20, ప్రభాతవార్త** హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై కిషన్ గూడ. తొండుపల్లి గ్రామాల వద్ద ప్రయాణి కుల సౌకర్యార్థం ఫుటోవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక నాయకులు పారేపల్లి శ్రీనివాస్ గౌడ్. పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కోరారు . శుక్రవారం ఆయన నివాస గృహానికి వెళ్లి స్థానిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై అటు ఇటు తిరిగే గ్రామ స్తులకు. ప్రధానంగా విద్యార్థులకు ఈ రహదారి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. తప్ప నిసరి పరిస్థితుల్లో రోడ్డు దాటుతున్న అనేకమంది ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకువ చ్చారు . ఫుటోవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుము ఖం పట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రకాష్ గౌడ్ చొరవ తీసుకొని నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదించి ఫుటోవర్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. బస్తీలలో మిగిలిపోయిన సిసి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రవీణ్ గౌడ్. శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



**కొడంగల్ రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త** కొడంగల్ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపించేసిన ఎమ్మార్వో విజయ్ కుమార్ ఎస్సై సత్యనారాయణ, చలికాలం నేపథ్యంలో విద్యార్థులకు దుప్పట్లు అవసరమని తెలుసుకొని ఎమ్మార్వో స్పందించి విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వడం జరిగిందన్నారు విద్యార్థులు చదువు పైన శ్రద్ధ ఉంచి ఉన్నత స్థాయి ఎదగాలని ఎమ్మార్వో సూచించారు,ఈ కార్యక్రమంలో బీజూవీ మరియు యాదయ్య గౌడ్, హాస్టల్ సిబంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి గురై ఆవు మృతి



**కేశంపేట డిసెంబరు 20 ప్రభాతవార్త** విద్యుత్ ఘాతుకానికి గురై ఆవు మృతి చెందిన ఘటన కేశంపేట మండల పరిధిలోని పోమల్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రైతు నీదురం జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం ప్రతిరోజు మాదిరిగానే పశువులను గ్రామ శివారులో గల తంగేళ్లగడ్డ సమీపంలోకి పశువులను మేపెందుకు తీసుకువెళ్లగా ఎలాంటి రక్షణ కవచం లేని ట్రాన్స్ఫార్మర్ తగిలి ఆవు మృతి చెందిందని దీని విలువ సుమారు 80,000 వేలు ఉంటుందని విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆవు మృతి చెందిందని ఆవు మృతి చెందడంతో తన జీవనోపాధిని కోల్పోయానని ప్రభుత్వం తనకు ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని రైతు జంగయ్య ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

## క్రీడలతోనే శరీర దారుఢ్యం, క్రమశిక్షణ

**ఎంఈఓ చంద్రశేఖర్**



**కేశంపేట డిసెంబరు, 20 ప్రభాతవార్త** క్రీడల ద్వారానే విద్యార్థుల్లో శారీర దారుఢ్యం, క్రమశిక్షణ ఏర్పడుతుందని విద్యార్థినీ విద్యార్థులకు క్రీడల ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలోని గ్లోబల్ స్కూల్లో అన్యువల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ చంద్రశేఖర్ హాజరై ప్రారంభించారు. క్రీడలలో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని క్రీడల పట్ల అవగాహన పెంచుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ సర్పంచ్ అమృతమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య చారి, గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణ చారి, డైరెక్టర్ మోనిక, ఉపాధ్యాయులు, శివ గుప్తా, ఏ ప్రవీణ్ కుమార్, పి ఈ టి రాజు, రూబీ, శ్రావణి, శైలజ, సుమతి, అలియా,వెంకటేష్ సుభాషిని, సరిత, మరియు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 50 పడకల ఆసుపత్రి ప్రారంభం

**తలకొండపల్లి, డిసెంబరు 20 ప్రభాతవార్త** తలకొండపల్లి మండలంలోని దేవుని పడకల్ గ్రామంలో ఆవేరు సంస్థ ఆధ్వర్యంలో 50 పడకల ఆసుపత్రిని డైరెక్టర్ రాజ వర్ధన్ రెడ్డి. మరియు తరుణ్ డాక్టర్ జగదీష్‌లు ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సేవ చేయాలని దృక్పథంతో 1977లో దేవుని పడకల గ్రామంలో ఆవిరి సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రిని నిర్మించడమైనదని. దేశవ్యాప్తంగా ఆవిర్ సంస్థ ఆధ్వర్యంలో ఎంతోమంది పేద ప్రజలకు గిరిజనులకు వైద్య సదుపాయం కల్పించామని ప్రజలకు అందుబాటులో వైద్యం తీసుకువచ్చామని వారు అన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే ఎంపీ మరియు మాజీ ఎమ్మెల్యే మనీ అన్ని పార్టీల నాయకులు ఎందుకు తమకు తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.. హాస్పిటల్ ఆఫ్ గ్రేట్ చేసి 50 పడకల ఆసుపత్రికి చేశామని 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారని కార్పొరేట్ ఆసుపత్రిలో పనులు అన్నీ కూడా ఈ ఆస్పత్రిలో అతి తక్కువ ఖర్చుకి చేస్తామని ఈ యొక్క సదుపాయాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.. ఈ కార్యక్రమంలో వేణుగోపాలరావు నాగేశ్వరరావు .వెంకన్న. మాజీ సర్పంచులు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుమ్మరి శంకర్. శంకర్ నాయక్. శ్రీశైలం. మాజీ ఎంపిటిసి మల్లేష్. గ్రామస్తులు మల్లేష్. పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు

